డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు



డిప్యూటీ సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేస్తున్న కర్క నాగరాజు, సంఘం సభ్యులు

బాలానగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు సదామహేశ్, శ్రీకాంత్‌యాదవ్, జక్కుల అశోక్, చిన్నసాయి భట్టిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓల్డుబోయినపల్లి: రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఓల్డుబోయినపల్లి డివిజన్ దండుగుల యాదగిరి, భరత్, రమణ తదితరులు.

మేయర్‌ను కలిసిన కార్పొరేటర్



మేయర్ విజయలక్ష్మికి వినతి పత్రం ఇస్తున్న సతీష్‌గౌడ్

ఫతేనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మిని శనివారం కలిశారు. డివిజన్‌లో ఉన్న హిందూ శ్మశాన వాటికలో మిగిలి ఉన్న అభివృద్ధి పనులు, ఇందిరా గాంధీపురంలో నిధులు లేక నిలిచిపోయిన రోడ్డు, శోభనాకాలనీ రోడ్‌నెంబర్ 4, పైప్‌లైన్ రోడ్డు, భరత్‌నగర్ కాలనీ రోడ్డు పనులన పరిష్కరించాలని, ఈ పనుల కోసం కావలసిన నిధులను మంజూరు చేయాలని మేయర్‌కు వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు.

స్కూలు భవనం పనుల పరిశీలన

బాలానగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధి చెరబండ రాజు కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం పనులను కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో నిర్మాణ పనులు వేగవంతం చేసి స్కూలు భవనాన్ని త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓ ఫార్మా కంపెనీ సౌజన్యంతో అత్యాధునిక వసతులతో స్కూలు భవనం నిర్మిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, మహేందర్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, రాము పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

కూకట్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్న మూసాపేటకు చెందిన రాజేశ్వరరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుసుకొన్న కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ మృతుడి కుటుంబసభ్యులకు శనివారం రూ.4 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. రాజేశ్వరరావు పనిచేసే భవన నిర్మాణ యజమానిని పిలిపించి అతడి చేతులు మీదుగా సాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతిలేని నిర్మాణాలపై కఠిన చర్యలు

దుండిగల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ దొమ్మరపోచంపల్లి, బహదూర్‌పల్లి ప్రాంతాల్లో అనుమతి లేకుండా వెలసిన షెడ్లను మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు శనివారం సిబ్బంది కూల్చివేశారు. మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. దొమ్మరపోచంపల్లి, బహదూర్‌పల్లి ప్రాంతంలో వెలిసిన షెడ్లను నేలమట్టం చేసినట్టు తెలిపారు. అనుమతి లేకుండా షెడ్లను నిర్మిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పాఠశాల ప్రహరీ, బస్సుషెల్టర్ నిర్మించాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ప్రహరీ, బస్సుషెల్టర్ల నిర్మాణాలను చేపట్టాని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు జీడిమెట్ల దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఆయన నివాసంలో స్వామి వివేకానంద్ యూత్ సభ్యులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలోని మొదటి అంతస్తు ప్రహరీ నిర్మాణానికి, గాంధీనగర్ ప్రధాన రహదారిపై బస్సుషెల్టర్ నిర్మాణం, సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వివరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనాథ్, శ్రీనివాస్, నవీన్‌లు ఉన్నారు.

'ఎమ్మెల్యే ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకోవాలి'

దుండిగల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రూ.30 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి ఆక్రమించాడని, బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సూరారంలోని సర్వే నెంబర్లు 166, 167ల్లో ప్రభుత్వ భూమి దాదాపు ఎకరం పైచిలుకు ఆక్రమించుకొని, సీఎంఆర్, సీబీఎస్ స్కూల్ గ్రౌండ్, షెడ్లనిర్మాణం ఈ విషయాన్ని బీజేపీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తే, దీనిపై స్పందించిన అధికారులు నోటీసులు జారీ చేసి, ఆభూమిలో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేశారు. సీఎంఆర్, సీబీఎస్ స్కూల్ గ్రౌండ్, పార్కింగ్ అవసరాలకు వాడుకుంటున్న సీఎంఆర్ విద్యా సంస్థల అధినేత, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వ భూమి చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రజా అవసరాల కొరకు వినియోగించాలని అధికారులు కోరారు.



సమావేశంలో కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ

కమ్మవారి సమాఖ్య తెలంగాణ కమిటీ ఎన్నిక

మియాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం సమాఖ్య గౌరవ అధ్యక్షులు సి.వి.రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధ్యక్షతన అమీర్‌పేటలోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. వీలైనంత త్వరలో కో-ఆపరేటివ్ బ్యాంకు స్థాపించి కమ్మ సామాజిక వర్గానికి చెందిన అవసరమైన వారికి రుణాలు, వారి పిల్లలకు విద్యారుణాలు, రాష్ట్ర ప్రభుత్వం కమ్మ సంఘానికి కేటాయించిన ఐదు ఎకరాల స్థలానికి ఫైనల్ చేయడం కోసం ప్రభుత్వాన్ని సంప్రదించి కోర్టు కేసు ఉపసంహరించుకునేలా వీలైనంత త్వరలో స్థలంలో నిర్మాణాలు చేపట్టాలని తీర్మాణాలు చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి డాక్టర్ పునకొల్లు నాగభూషణం, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో వైశ్యసంఘం ప్రతినిధులు

ఘనంగా వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్

రాయదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్ కార్యక్రమాన్ని శనివారం గచ్చిబౌలిలో ఘనంగా నిర్వహించారు. వైశ్యసంఘంలో దేశవ్యాప్తంగా ప్రతిభ కబరిచిన 18 మంది వైశ్యులను సన్మానించారు. ఎమ్మడి శివకుమార్ స్థాపించిన వైశ్య లైమ్‌లైట్ అవార్డులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నిర్వహించిన ఫ్యాషన్‌షో అందరినీ ఆకట్టుకుంది. సాంస్కృతిక వారసత్వాన్ని ఈ షోలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, అవార్డు గ్రహీతలు, క్రీడాకారులు, వైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం మరిచారు

- లోక్‌సభ ఎన్నికల ముందు పాతబ్రిడ్జి కూల్చివేత
- ఎన్నికల కోడ్ ముగిసినా మొదలు కాని పనులు
- వర్షాలకు ఇళ్లలోకి వస్తున్న మురుగు



పాత బ్రిడ్జి తవ్విన ప్రాంతం

పేట్‌బషీరాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బ్రిడ్జి నిర్మాణం కోసం పాత బ్రిడ్జిని కూల్చేశారు. ఎన్నికల కోడ్ వచ్చిందని పనులు ప్రారంభించకముందే నిలిపివేశారు. బ్రిడ్జి తవ్వడంతో చుట్టుపక్కల ఉన్న 20 కాలనీల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆరు నెలల నుంచి ఇబ్బందులు పడిన ప్రజలు కోడ్ ముగియడంతో బ్రిడ్జి పనులు ప్రారంభమవుతాయని అనుకున్నారు. కానీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడం లేదు. ఈ విషయాన్ని అతడిని ప్రశ్నించగా నాలా పక్కనే విద్యుత్ స్తంభాలున్నాయని, వర్షాకాలంలో పనులు చేస్తే స్తంభాలు కూలిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు. బ్రిడ్జి లేకపోవడంతో పక్కనున్న కాలనీకి వెళ్లడానికి కిలోమీటర్ మేర తిరిగి వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రిడి కూల్చివేసి ఆరు నెలలు గడిచిపోయాయని, ఎన్నికల కోడ్ ముగిసినా పనులు మొదలు కాలేదని జీడిమెట్ల డివిజన్‌లోని బోలోశంకర్‌నగర్ వాసులు ఆందోళన చెందుతున్నారు. బోలోశంకర్‌నగర్ నుంచి వెంకన్నహిల్స్‌కు వెళ్లే బ్రిడ్జి నిర్మాణం కోసం రూ.85 లక్షలు మంజూరయ్యాయని మార్చిలో పనులను ప్రారంభించారు. దీని కోసం పాత బ్రిడ్జిని కూల్చివేశారు. అప్పటి నుంచి ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దత్తాత్రేయనగర్, ఎంఎన్‌రెడ్డినగర్, వివేకానంద్‌నగర్, బ్యాంక్‌కాలనీ, రాఘవేంద్ర కాలనీలతో పాటు 20 కాలనీల ప్రజలు ఈ రోడ్డుగుండా రాకపోకలు సాగిస్తున్నారు. రెండు నెలలు నుంచి తవ్వి వదిలేసిన నాలా బ్రిడ్జి పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో నాలా ప్రక్కనే ఉన్న ఇళ్లలోకి మురుగునీరు వచ్చి చేరుతోందని ఆందోళన చెందుతున్నారు. పనులు ప్రారంభించడంలో ఉన్న శ్రద్ధ నిర్మాణంలో చూపడం లేదని, దీంతో వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పనులు ఎందుకు చేస్తలేరని ప్రశ్నిస్తే నాలా ప్రక్కనే విద్యుత్ స్తంభాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారని వాపోతున్నారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని నాలా పనులను మొదలు పెట్టాలని ఆ ప్రాంతవాసులు అధికారులను వేడుకుంటున్నారు.

బ్రిడ్జి పనులు చేపట్టాలి

బ్రిడ్జి నిర్మాణానికి విద్యుత్ స్తంభాలు అడ్డంగా వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. పనులు ప్రారంభించినప్పుడు అధికారులకు స్తంభాలు కనిపించలేదా?. కుత్బుల్లాపూర్ గ్రామంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి.

\- లక్ష్మి, స్థానికులు

కాలనీలో తిప్పలు తప్పడం లేదు

అత్యవసర పని పడితే ఇబ్బంది పడుతున్నాం. కాలనీలోకి ఎమర్జన్సీ కోసం ఏదైన వాహనం రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షానికి నాలా పొంగి మురుగునీరు ఇళ్లలోకి వస్తుంది. బ్రిడ్జిని తవ్వేసి, మట్టిని పూర్తిగా తీయకుండా నాలాలో ఉండడంతోనే ఈ పరిస్థితి నెలకొంది.

\- శేఖర్‌రెడ్డి, వెంకన్నహిల్స్



పేషంట్లతో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్‌రెడ్డి

సిటీ పోలీస్, ఆకార్ ఆశా ఆస్పత్రి ఆధ్వర్యంలో..

వైకల్య ఉచిత వైద్య శిబిరం

- హాజరైన సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీపోలీస్, ఆకార్ ఆశా ఆస్పత్రి కూకట్‌పల్లి ఆధ్వర్యంలో.. హాకా భవన్‌లోని భరోసా సెంటర్‌లో శనివారం నిర్వహించిన శారీరక వైకల్యం ఉన్నవారికి ఉచిత పరీక్షలు, శస్త్రచికిత్స శిబిరాన్ని క్రైమ్స్ డీసీపీ శ్వేత, ఉమెన్ సేఫ్టీ డీసీపీ కవితతో కలిసి సిటీ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్నవారు, ప్రమాదాల బారినపడి వైకల్యం సంభవించిన వారు, అగ్ని ప్రమాద బాధితులు, శరీరంపై కణతులు ఉన్నవారికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా సర్జరీలు చేయడానికి ముందుకొచ్చిన డాక్టర్ బర్టెండ్ స్టైన్, డాక్టర్ షాలినిసంప్రీతి, డాక్టర్ తేజస్వీదాస్‌లను సీపీ అభినందించారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 150 బాధితులు హాజరయ్యారు. వారందరికీ వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలతో పాటు.. రక్తనమూనాల సేకరణ, ఇతర అవసరమైన పరీక్షలను నిర్వహించారు. వారికి అవసరమైన శస్త్ర చికిత్స అందజేశారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీ పేషంట్స్‌తో, వారి తల్లిదండ్రులు, సహాయకులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శారీరక దివ్యాంగుల కోసం ఇలాంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఆకార్ ఆశా యాజమాన్యంతో పాటు, షీటీమ్స్, భరోసా సెంటర్ పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: ఏసీపీ

కూకట్‌పల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పండుగలను ప్రశాంత వాతావరణంలో సంతోషకరంగా జరుపుకోవాలని కూకట్‌పల్లి ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు అన్నారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి హాజరైన అన్నీ మతాలకు చెందిన వారికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు కృష్ణమోహన్, ఉపేందర్‌రావు, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్స్ కో-ఆపరేటివ్ వెల్ఫేర్ చైర్మన్‌గా వెంకటేశం ముదిరాజ్



వెంకటేశం ముదిరాజ్

దుండిగల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిషర్స్ కో-ఆపరేటివ్ వెల్ఫేర్ కమిటీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చైర్మన్‌గా చిన్నంగి వెంకటేశం ముదిరాజ్ శనివారం నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల, మత్స్య సంపద అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మత్స్య కారులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తూ, ఉపాధి అవకాశాన్ని కల్పించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానన్నారు.

మురుగు నీటిని కట్టడి చేయండి

పేట్‌బషీరాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కొంపల్లి సెంట్రల్ పార్కు రోడ్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ రోడ్డుపై పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పురపాలక సఘంలోని సెంట్రల్ పార్కు, న్యూజువీడు సీడ్స్ పరిశ్రమ సమీపంలోని ప్రధాన రహదారుల్లో నిత్యం డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి పొంగి రోడ్లపై పారుతుండడంతో అటు వైపు వాహనదారులు, పాదారులు వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సి వస్తోందని ప్రయాణికులు పేర్కొన్నారు. మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు.. సైబర్ సేఫ్టీ పాఠాలు

రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ (ఆర్‌కేఎస్‌సీ), రాచకొండ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో వయో వృద్ధులకు సైబర్ నేరాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సైనిక్‌పురిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిజిటల్ సేఫ్టీ నిపుణులతో పాటు సైబర్ క్రైం ఏసీపీ కరుణాకర్‌లు సైబర్ నేరాలు జరిగే తీరు, వాటి బారిన పడకుండా తప్పించుకోవడం, అవగాహన, సైబర్ సురక్ష, పాస్‌వర్డ్ ప్రొటెక్షన్, ఫిషింగ్ తదితర అంశాలపై వయోవృద్ధులకు శిక్షణ ఇచ్చారు. డిజిటల్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం పట్ల సీపీ తరుణ్ జోషి ఆర్‌కేఎస్‌సీ సభ్యులను అభినందించారు. విద్యార్థులు, యువత కోసం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్‌కేఎస్‌సీ జనరల్ సెక్రటరీ డాక్టర్ రఘువీర్, కోఆర్డినేటర్ సావిత్రితో పాటు పోలీసు అధికారులు, సీనియర్ సిటిజన్‌లు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో అక్రమాలపై విచారణ జరిపించాలి

- మంత్రి దామోదర రాజనరసింహకు ఆర్.కృష్ణయ్య బృందం వినతి



మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య బీసీ సంఘాల నేతలు

రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల అమలులో జరిగిన అక్రమాలు అవకతవకలపై విచారణ జరిపించాలని జీవో నంబర్ 550ని సక్రమంగా అమలు చేయాలని సీట్ల కౌన్సెలింగ్‌పై ఉన్నతస్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి వినతిపత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడు తూ జీవో 550ని సక్రమంగా అమలు చేయకపోవడంతో 262 మంది ఎస్సీ ఎస్టీ బీసీలకు ఎంబీబీఎస్ సీట్లు దక్కకుండా పోయాయని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం అనేక సంవత్సరాలుగా హైకోర్టు, సుప్రీంకోర్టులతో పోరాటం చేసి జీవో నంబర్ 550ని జారీ చేయిస్తే ఆ జీవోను వైద్యఆరోగ్య శాఖ అధికారులు సక్రమంగా అమలు చేయకుండా ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లు నిర్వహించారని పేర్కొన్నారు. దీనివల్ల ఎస్సీ ఎస్టీ బీసీలకు రావాల్సిన సీట్లు కోల్పోయి అన్యాయం జరిగిందన్నారు, యూనివర్శిటీ అధికారులు ఉద్దేశ పూర్వకంగానే ఈ జీవోను ఉల్లంఘించారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు వారు తెలిపారు. 2019 మెడికల్ కౌన్సిలింగ్‌లో ఓపెన్ కాంపిటియషన్ లాస్ట్ కటాఫ్ మార్కులు 509 కాగా ఆ తర్వాతనే రిజర్వేషన్లు లెక్కించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు గుజ్జ కృష్ణ, సి.రాజేందర్, నందగోపాల్, భూపేష్‌సాగర్, రాజ్‌కుమార్, రఘుపతి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

20న కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేష్ ప్రమాణ స్వీకారం



స్పీకర్ ప్రసాద్ కుమార్‌తో శ్రీగణేష్

సికింద్రాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా ఎన్.శ్రీగణేష్ ఈనెల 20న ఉదయం 11గంటలకు అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శనివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శ్రీగణేష్ కలిసి ప్రమాణ స్వీకారం విషయమై చర్చించారు.

వరదల సమయంలో జాగ్రత్తలపై ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వరదలు, రెస్క్యూ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జీహెచ్ఎంసీ ఈవీడీఎం ఆధ్వర్యంలో ఎన్‌జీవో గ్రూపులకు ఒక రోజు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరద, ముంపు ప్రాంతాల్లో విపత్తు సమయంలో నష్టాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై వాలంటీర్లకు ఫతుల్లాగూడ డీఆర్ఎఫ్ శిక్షణ కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వడంతోపాటు క్యాంపస్‌లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తికల్గిన వారు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.శ్యాంసుందర్‌రెడ్డి ఫోన్ నం.7981665687లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏఎస్‌ఐ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్ పరిధిలోని యాచారం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఏఎస్‌ఐ జంగయ్య కుటుంబ సభ్యులకు సీపీ చెక్కును అందించారు. నేరేడ్‌మెట్ కమిషనర్ కార్యాలయంలో శనివారం జంగయ్య కుమారులు ప్రవీణ్‌కుమార్, సందీప్ కుమార్‌లకు కమిషనర్ తరుణ్ జోషి రూ.7,93,858 భద్రత చెక్కును అందజేశారు. అంతేకాకుండా జంగయ్య కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

సాయివైభవ్ కాలనీలో హరితహారం



కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

రాయదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ సాయివైభవ్ కాలనీ అధ్యక్షురాలు పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన హరితహారం కార్యక్రమం శనివారం వైభవోత్సవం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాయివైభవ్‌కాలనీలో హరితహారం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్‌ముదిరాజ్, రమేష్, శ్యామలేట్ శ్రీనివాస్, నారాయణ, కాలనీ అసోసియేషన్ వాసులు సుజిత్‌కృష్ణ, సరస్వతి, సిద్ధార్థ, నవీన్, పవన్, రాజు, సత్యనారాయణ, శర్మ, వేణు, వంశీ, రవి, వైజయంతి, రమ్య పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంపు ముగింపు

చందానగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నెలరోజుల నుంచి కొనసాగుతున్న జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంపు శనివారం తొలగించారు. చివరి రోజు వాలీబాల్‌క్రీడాకారులను దాతల సౌజన్యంతో సీనియర్‌కోచ్ అశోక్‌రెడ్డి, జూనియర్ కోచ్ వెంకటేష్‌గౌడ్ క్రీడాకారులకు వాలీబాల్ డ్రస్, షూస్ అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ ఎస్‌ఐ సరిత తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా లింగసముద్రం గ్రామానికి చెందిన బోడి మధు కుటుంబసభ్యులతో బతుకుదెరువు కోసం పదిహేను ఏళ్ల క్రితం కుత్బుల్లాపూర్ సుభాష్‌నగర్‌లోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కాంట్రాక్టర్, భవన నిర్మాణంలో మేస్త్రీ పనులు చేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భార్య సరోజిని రోజూ మాదిరిగానే పనికి వెళ్లింది. భవన నిర్మాణాల్లో నష్టాలు రావడంతో తాగుడుకు బానిసై, ఆరోగ్యం సహకరించకపోవడంతో మనఃస్తాపానికి చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని,మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొట్టిన టిప్పర్



డివైడర్‌ను ఢీకొట్టిన టిప్పర్

పేట్‌బషీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నిద్ర మత్తులో టిప్పర్ డైవర్ డివైడర్‌ను ఢీకొట్టాడు. పేట్‌బషీరాబాద్ సుచిత్రా నుంచి కుత్బుల్లాపూర్ వైపుకు వస్తుండగా మార్గమధ్యలోని గోదారి హోమ్స్ సమీపంలోని డివైడర్‌ను ఢీకొట్టడంతో గోడ కూలిపోయింది.టిప్పర్ ముందు టైరు ఊడిపోయింది. శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరగడం, రోడ్డుపై జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో ఉదయం నుంచి 2 గంటల పాటు ట్రాఫిక్ జామ్‌మై, కిలో మీటరు మేర వాహనదారులు రోడ్డు పైనే ఉండవలసి వచ్చింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మహిళను హత్య చేసిన ఆటోడ్రైవర్ అరెస్టు

చందానగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మహిళను హత్యచేసి పరారైన ఆటో డ్రైవర్‌ను చందానగర్ పోలీసులు 24 గంటలలోపు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం కేసుకు సంబంధించిన వివరాలను చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి వివరించారు. నల్లగండ్ల లక్ష్మీవిహార్ ఫేజ్-1లో విజయలక్ష్మి నివాసం ఉంటూ ఇళ్లలో పనిచేసేది. ఆటో డ్రైవర్ భరత్‌గౌడ్‌తో ఆమెకు వివాహేతర సంబంధి ఉంది. భరత్‌గౌడ్ నుంచి తన అవసరాల నిమిత్తం విజయలక్ష్మి డబ్బు అప్పుగా తీసుకుంది. డబ్బులు చెల్లించే విషయంలో గొడవ జరిగింది. అయితే శుక్రవారం విజయలక్ష్మిని ఇంటికి వచ్చిన భరత్‌గౌడ్ ఆమెతో గొడవ పడ్డాడు. విజయలక్ష్మి వెనుక డోర్ నుంచి బయటకు వెళ్లిపోతుండగా వెనుక నుంచి వచ్చిన భరత్‌గౌడ్ తాను తెచ్చుకున్న కత్తితో ఆమె మెడపై పొడిచి పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం భరత్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వీడని బాలిక హత్య కేసు మిస్టరీ

- 7న అదృశ్యం
- మూడు రోజుల తర్వాత మృతదేహం లభ్యం

మియాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వారం రోజులు గడిచినా బాలిక హత్య కేసు మిస్టరీ వీడడం లేదు. ఈ కేసుకు సంబంధించి వారం రోజులైనా బాలిక హత్య కేసు మిస్టరీని పోలీసులు చేధించలేకపోయారు. అన్ని కోణాల్లోనూ కేసు దర్యాప్తు చేస్తున్నామని చెబుతున్న పట్టికీ ఇప్పటి వరకూ పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకకపోవడంతో కేసు మిస్టరీపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌బాద్ జిల్లా మరిపెడ ప్రాంతానికి చెందిన భానోతు నరేష్, శారద దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వసంత(13) వీరితో కలిసి నగరానికి వచ్చింది. మియాపూర్ నడిగడ్డ తండాలో ఉంటూ కూలీ పనులు చేస్తున్నారు. వసంత 7వ తరగతి చదువుతోంది. ఈనెల 7వ తేదీ ఉదయం తల్లిదండ్రులు వసంతను చదువుకోమని చెప్పి మందలించి పనులకు వెళ్లారు. రాత్రి 9 గంటలకు వచ్చిన తర్వాత వసంత కనిపించలేదు. తండ్రి నరేష్ మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడు రోజుల తర్వాత నడిగడ్డతండా సమీపంలోని చెట్ల పొదల్లో బాలిక మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించారు. పూర్తిగా కుళ్లిపోయి ఉంది. మృతదేహంపై ఉన్న దుస్తులను బట్టి వసంతగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. 7న అదృశ్యమై మృతదేహంగా లభించిన వసంత కేసులో పోలీసులకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. బాలిక ఆత్మహత్య చేసుకుందా? ఎవరైనా కిడ్నాప్ చేసి హత్య చేశారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆధారాలు లభించలేదు. నడిగడ్డతండా నుంచి బయలుదేరి రోడ్డు దాటినట్టుగా ఉన్నా ఎక్కడికి వెళ్లిందనేది తెలియరాలేదు. మృతదేహం దుర్వాసన వచ్చిన తర్వాత గుర్తించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాతే ఈ కేసు మిస్టరీ వీడే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.